మాజీ సర్పంచుల సంఘం అయిజ మండలాధ్యక్షుడు గుడిదొడ్డి హనుమంతు రెడ్డి బుధవారం మాజీ మంత్రి హరీశ్‌రావును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. చాలా కాలంగా తమ బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో ఇబ్బందులు పడుతున్నామని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ విషయంపై హరీశ్‌రావు సానుకూలంగా స్పందించినట్లు హనుమంతురెడ్డి తెలిపారు.

– అయిజ రూరల్, డిసెంబర్ 18

కేటీఆర్‌ను టచ్ చేస్తే రాష్ట్రం అగ్నిగుండమే..

● బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కుర్వ విజయ్‌కుమార్

గద్వాల, డిసెంబర్ 18: ఫార్ములా – ఈ కార్ రేస్‌పై కాంగ్రెస్ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తూ కేటీఆర్‌పై కేసులు నమోదు చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని.. కేటీఆర్‌ను టచ్ చేస్తే రాష్ట్రం అగ్నిగుండంలా మారుతుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కుర్వ విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. రేవంత్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం కాగా.. వాటిపై పోరాటాలు చేస్తున్న కేటీఆర్‌ను ఎదుర్కొన లేక కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనపై కుట్రలు చేస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు హైదరాబాద్‌కు కేటీఆర్ ఫార్ములా–ఈ కార్ రేస్‌ను తీసుకొచ్చి హైదరాబాద్ ప్రతిష్ఠను దేశ వ్యాప్తంగా గుర్తింపు వచ్చేలా చేస్తే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత దానిని రద్దు చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చి 420 హామీలు అమలు చేసేవరకు వారిని బీఆర్ఎస్ ప్రశ్నిస్తూనే ఉంటుందని చెప్పారు. హైదరాబాద్‌ను అభివృద్ధి చేసి ప్రపంచ పటంలో ఉంచాలని కేటీఆర్ ఫార్ములా–ఈ కార్ రేస్ తీసుకొస్తే ప్రస్తుత సీఎం హైదరాబాద్ ప్రతిష్ఠను దిగజార్చేవిధంగా ప్రయత్నిస్తున్నాడన్నారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో వారు అమలు చేయని హామీలపై కేటీఆర్ ఉద్యమాలు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి జీర్ణించుకోలేక పోతున్నాడన్నారు. కేటీఆర్‌ను కాంగ్రెస్ ఎదుర్కొనలేక తప్పుడు కేసులు నమోదు చేయాలని చూస్తుందని ఆరోపించారు. కేటీఆర్ కొల్లాపూర్ తాలూకాలో జరిగిన శ్రీధర్‌రెడ్డి హత్య, హైడ్రా బాధితులకు అండగా లగచర్ల రైతులను సీఎం రేవంత్ జైలుకు పంపితే వారికి బాసటగా నిలిచాడన్నారు. గురుకుల విద్యార్థులకు సరైన భోజనం కాంగ్రెస్ ప్రభుత్వం అందించలేక పోవడం వల్ల చాలామంది విద్యార్థులు అస్వస్థకు గురై మరణిస్తే వారి పక్షాన నిలబడ్డారని తెలిపారు. ఇలా ప్రభుత్వ వ్యతిరేక విధానాలను కేటీఆర్ ప్రశ్నిస్తే ఆయన వ్యక్తిత్వానికి భంగం కలిగేలా రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నాడన్నారు. అర్హతలేని సృజన్‌రెడ్డి కంపెనీకి రూ.11వేల కోట్ల ప్రాజెక్టును కట్టబెట్టడాన్ని కేటీఆర్ తీవ్రంగా వ్యతిరేకించడంతోపాటు కేంద్ర మంత్రులకు ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు. విద్యుత్ చార్జీల పెంపును కేటీఆర్ అడ్డుకున్నారని.. కేటీఆర్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తూ తప్పుడు కేసులు నమోదు చేస్తే తెలంగాణ సమాజం చూస్తూ ఊర్కోదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మల్లి, జయన్న, బీచుపల్లి, దామోదర్, నర్సింహ, భీమన్న, రాము, ఆటో మక్బూలు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు సంఘీభావం

జిల్లా కోర్టు సముదాయానికి పీజేపీ క్యాంపులో స్థలం కేటాయించాలని డిమాండ్ చేస్తూ గద్వాలలోని కోర్టు న్యాయవాదులు చేపట్టిన నిరాహార దీక్షలో విజయ్‌కుమార్ పాల్గొని వారికి సంఘీభావం తెలిపారు. అలాగే రాజీవ్‌మార్గ్ రోడ్డులో

ఎస్ఎస్ఏ ఉద్యోగులకు సంఘీభావం తెలిపి మాట్లాడుతున్న విజయ్‌కుమార్

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎస్ఏ ఉద్యోగుల చేస్తున్న సమ్మెకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగులు రోడ్లెక్కడం బాధాకరం

గద్వాలటౌన్, డిసెంబర్ 18: విధులు నిర్వహించాల్సిన ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం రోడ్లెక్కడం బాధాకరమని బీఆర్ఎస్ నాయకులు విజయ్‌కుమార్ అన్నారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రంలోని స్మృతివనం వద్ద చేపట్టిన సమ్మె కొనసాగుతున్నది. సమ్మెలో భాగంగా ఉద్యోగులు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. అలాగే అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేసి నిరసన వెలిబుచ్చారు. సమ్మెకు బీఆర్ఎస్ నాయకులు, విశ్రాంత హెచ్ఎంలు, ఉపాధ్యాయులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో కేజీబీవీల ప్రత్యేక అధికారులు, సీఆర్టీసీలు, పీజీసీఆర్టీలు, నాన్‌టీచింగ్ స్టాఫ్, ఎస్ఎస్ఏ ఉద్యోగులు పాల్గొన్నారు.

గ్రూప్-4 ఉద్యోగిని సన్మానించిన మాజీ మంత్రి



నరేశ్‌యాదవ్‌ను సన్మానిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి టౌన్, డిసెంబర్ 18: వనపర్తి పట్టణానికి చెందిన నరేశ్‌యాదవ్ గ్రూప్–4 ఉద్యోగం సాధించాడు. బుధవారం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి నరేశ్‌యాదవ్‌ను అభినందించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. గ్రూప్–4 ఫలితాల్లో వనపర్తి జిల్లా మొదటి ర్యాంకు సాధించి జూనియర్ అకౌంటెంట్ పోస్టుకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. కష్టపడితే ఏదైనా సాధించవచ్చని నరేశ్‌యాదవ్ నిరూపించారని, ఉద్యోగం సాధించడంపై యువతకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు ఇమ్రాన్, మహేశ్వర్‌రెడ్డి, రాము, చింటూ, మునికుమార్, అలీమ్ తదితరులు ఉన్నారు.

కార్యకర్త కుటుంబానికి పరామర్శ

పెబ్బేరు, డిసెంబర్ 18: శ్రీరంగాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ధర్మతేజనాయుడు నిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి బుధవారం బాధితుడి ఇంటికెళ్లి మృతుడి భార్య, తల్లిదండ్రులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి పార్టీ, తాను అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

పేదల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం

● గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల

గద్వాల, డిసెంబర్18: పేదల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయమని గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గద్వాల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 19మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.5,78,300 చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. ఎవరైనా అనారోగ్యం బారిన పడి వైద్యం చేయించుకోలేనివారు సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకుంటే వారికి సీఎం సహాయ నిధి ద్వారా చేయూతనిస్తారని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో నాయకులు బండారి భాస్కర్, గడ్డం కృష్ణారెడ్డి, ప్రతాప్‌గౌడ్, రమేశ్‌నాయుడు, చక్రధర్, బాబర్, వాసు, నీలేశ్వర్‌రెడ్డి, గోపిరెడ్డి, సత్యనారాయణ, రఘునాయుడు, నాగరాజు, సత్యంరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, శ్యామ్, నరేందర్‌రెడ్డి, కృష్ణ, మన్యం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

హైమావతికి నివాళులర్పిస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

వనపర్తి టౌన్, డిసెంబర్ 18: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన బుధవారం కొనసాగింది. ఖమ్మం జిల్లాలో ఆకస్మికంగా మృతిచెందిన సమగ్ర శిక్షా ఉద్యోగిని హైమావతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. దీక్షా శిబిరాన్ని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆంజనేయులు, రాజు సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు తీర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్, వాహిద్, శ్రీనాథ్ ఉన్నారు.

వరికొయ్యలను కాల్చొద్దు

గోపాల్‌పేట, డిసెంబర్ 18: వాన కాలం వరిసాగు చేసిన రైతులు పంట కోత తర్వాత పొలంలో ఉన్న వరికొయ్యలను తగుల బెట్టవద్దని ఏవో కరుణశ్రీ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. వరి కొయ్యలను తగులబెడితే భూమిలో ఉండే పోషకాలు తగ్గి పంట దిగుబడి తగ్గుతుందని పేర్కొన్నారు. అధిక వేడితో పంటకు మేలు చేసే సూక్ష్మజీవులు, మిత్ర పురుగులు చనిపోతాయన్నారు.

నడక, వ్యాయామానికి వీలుగా అభివృద్ధి పనులు చేయాలి

● వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి టౌన్, డిసెంబర్ 18: జిల్లా కేంద్రంలోని నల్ల చెరువును పట్టణ ప్రజలకు నడక, వ్యాయామం చేసుకునేందుకు వీలుగా అభివృద్ధి చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం ఉదయం అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, మున్సిపల్ చైర్మన్ మహేశ్, అధికారులతో కలిసి నల్ల చెరువును సందర్శించారు. పట్టణ ప్రజలకు ఉదయం సాయంత్రం కాలి నడక, వ్యాయామం చేసుకునేవిధంగా కట్టను అభివృద్ధి చేయాలని అందుకు అవసరమైన డీపీఆర్‌ను సిద్ధం చేసి ప్రతిపాదనలు ఇవ్వాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బ్రిడ్జిపై నుంచి భారీ వాహనాలు నడవకుండా గేట్ పెట్టాలని సూచించారు. ప్రజలు నడకతోపాటు వ్యాయామం చేసుకునే విధంగా ఓపెన్ జిమ్, పిల్లలు ఆడుకునేందుకు వీలుగా ఆట వస్తువులు, రెండు వైపులా అందమైన మొక్కలు పెంచాలని సూచించారు.

క్యాన్సర్ నిర్ధారణ కార్యక్రమం ప్రారంభం

హైదరాబాద్‌కు చెందిన ఎంఎన్‌జే క్యాన్సర్ దవాఖాన వనపర్తి జిల్లాలో ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, మున్సిపల్ చైర్మన్ మహేశ్, సన చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు సురభి సత్యయ్య, సురభి నర్సమ్మతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సన చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్ యాజమాన్యం రూ.కోట్లు వెచ్చించి మామోగ్రమి యంత్రాలను జిల్లాకు తీసుకొచ్చిందని పేర్కొన్నారు. మున్సిపల్ పారిశుధ్య మహిళా సిబ్బంది, ఇతర గ్రామాల్లోని క్యాన్సర్ అనుమానిత మహిళలను 102 వాహనంలో ఇక్కడికి తీసుకురావడం జరిగిందని అందరూ.. క్యాన్సర్ నిర్ధారణ వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అదేవిధంగా బీపీ, షుగర్, టీబీ పరీక్షలు సైతం ఇక్కడే ఉచితంగా నిర్వహిస్తారని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సన చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు సురభి సత్తయ్య, ఆదాయపు పన్ను శాఖ ప్రధాన కమిషనర్ సురభి నర్సమ్మ, డీఎంహెచ్‌వో శ్రీనివాసులు, కలెక్టర్ సతీమణి నిపుణ్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ కృష్ణ, ఎంఎన్‌జే హాస్పిటల్ సూపరింటెండెంట్ ప్రసాద్, ప్రోగ్రాం ఆఫీసర్ సాయినాథ్‌రెడ్డి, డాక్టర్ రాంచంద్రరావు, మున్సిపల్ కమిషనర్

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

పూర్ణచందర్, మున్సిపల్ డీఈ యూనస్, ఏఈ పాల్గొన్నారు.

మిల్లర్లు వెంటనే డబ్బులు చెల్లించాలి

2022–23 రబీ సీజన్ వేలం వేసిన ధాన్యానికి సంబంధించి మిల్లర్లు వెంటనే డబ్బులు చెల్లించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. డబ్బులు చెల్లించే విషయంలో రైస్ మిల్లర్లు నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. ఈ విషయంలో సహకరించిన మిల్లర్లకే రాబోయే రోజుల్లో ధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు.

అభివృద్ధి పనులను వేగిరం చేయాలి

● జోగులాంబ గద్వాల కలెక్టర్ సంతోష్

గద్వాల, డిసెంబర్18: మున్సిపాలిటీలకు వచ్చే ఆదాయాలను పక్కాగా నిర్వహించి అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ సంతోష్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గద్వాల, అలంపూర్, వడ్డేపల్లి మున్సిపాలిటీలకు మంజూరైన నిధులు, వాటి ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులపై సమీక్షించారు. 15వ ఫైనాన్స్, సీఎం అష్యూరెన్స్ ఫండ్, పన్నులు, గృహ నిర్మాణ అనుమతులు, ఎల్ఆర్ఎస్ ద్వారా వచ్చిన ఆదాయాల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వచ్చిన ఆదాయాన్ని సరైన అకౌంటింగ్ ప్రక్రియలతో నిర్వహించి, చార్టెడ్ అకౌంటెంట్ల ద్వారా ఎప్పటికప్పుడు ఆడిట్ చేయించాలన్నారు. నిధులను ఇతర పనులకు మళ్లించకుండా పద్ధతి ప్రకారం ఖర్చుచేయాలని ఆదేశించారు. అభివృద్ధి పనులు వేగవంతం, వివిధ స్కీంల ద్వారా నుంచి వచ్చిన నిధులు ద్వారా చేపట్టిన పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. స్వచ్ఛభారత్ నిధుల కింద చేపట్టిన మరుగుదొడ్లు, పబ్లిక్, కమ్యూనిటీ టాయిలెట్స్ నిర్మాణ పనుల పురోగతిపై కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. చేపట్టిన పనులను త్వరలో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని, పనులకు సంబంధించిన పూర్తి వివరాలతో సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. వచ్చేవారం వరకు నిధుల వివరాలను సమగ్రంగా అందజేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు, మున్సిపల్ కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను బుధవారం కలెక్టర్ సంతోష్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నదీమాగ్రహారంలో ఉన్న గద్వాల మున్సిపాలిటీకి తాగునీరు అందించే పథకం కింద చేపట్టిన ఫిల్టర్ ప్లాంట్‌ను సందర్శించి అందులో ఉన్న విభాగాలను పరిశీలించారు. అమృత్ 2.0పథకం కింద ప్రతిపాదిత కొత్త వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, 5ఎంఎల్‌డీ సామర్థ్యంతో నిర్మించబడే ప్లాంట్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంబారీ టౌన్‌షిప్ పనులను పరిశీలించి పెండింగ్ పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. సీఎం హామీ నిధుల కింద జరుగుతున్న పనులను కలెక్టర్ పర్యవేక్షించారు. నల్ల కుంటలో నిర్మాణంలో ఉన్న మల్టీపర్పస్ ఆడిటోరియం పనులు సందర్శించి ఆడిటోరియంకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. తేరుమైదానం, కృష్ణవేణిచౌక్ సమీపంలోని అండర్‌గ్రౌండ్ వర్షపునీటి కాల్వను పరిశీలించారు. పనులు వేగవంతంగా చేపట్టి పూర్తి చేయాలని మున్సిపల్ ఇంజినీర్లకు కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట అధికారులు మల్లేశ్, గోపాల్ తదితరులు ఉన్నారు.

పెండింగ్ వేతనాలను విడుదల చేయాలి

గద్వాల అర్బన్, డిసెంబర్ 18: ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే స్కావెంజర్లకు పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పేర్ నర్సింహ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఒక్కో పాఠశాలకు ఒక్కో విధంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఈ నిధులతో ఒక్కో పాఠశాలలో ఇద్దరు, ముగ్గురు కార్మికులను అతితక్కువ వేతనాలకు నియమించుకున్నారన్నారు. ఈ సంవత్సరం ప్రభుత్వ నిధులు మంజూరు చేసినా ఇప్పటి వరకు కార్మికుల ఖాతాల్లో జమ చేయలేదన్నారు. పెండింగ్ వేతనాలు కూడా త్వరగా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రఘు, పార్వతి, చంద్రశేఖర్, మాధవి, రామాంజనేయులు, ఆసియా బేగం, మజురంబి, గోవిందు తదితరులు ఉన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

అయిజ, డిసెంబర్ 18 : ఎస్ఎస్ఏ ఉద్యోగుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం అయిజ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల, సింధనూర్ జెడ్పీహెచ్ఎస్‌లో భోజన విరామ సమయంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులకు సంఘీభావం ప్రకటించారు. పాఠశాలల ఆవరణలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. వారం రోజులుగా ఉద్యోగులు నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని వాపోయారు. కార్యక్రమంలో ఎంఈవో రాములు, సింధనూర్ ఇన్‌చార్జి హెచ్ఎం భద్రయ్య, ఉపాధ్యాయులు లింగయ్య, రాజు, సుభాన్ భాషా, ప్రవీణ్‌కుమార్, శైలజ, సాజీదా పాల్గొన్నారు.

సింధనూర్‌లో సంఘీభావం ప్రకటించిన ఉపాధ్యాయులు

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

● అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

అమరచింత, డిసెంబర్ 18: కుట్టుశిక్షణను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ సూచించారు. బుధవారం డీఆర్డీవో ఉమాదేవి, ఏపీడీ సుల్తాన్, ఎంపీడీవో శ్రీనివాసులుతో కలిసి పట్టణంలోని ఎస్సీ కాలనీలో నిర్వహిస్తున్న కుట్టుశిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని పాంచాడ్డిపల్లి, క్రిష్ణంపల్లిలో నర్సరీలను పరిశీలించి మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఏపీవో రఘు, టీఏ మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

ఆశ్రమాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్

వపనర్తి టౌన్, డిసెంబర్ 18: జిల్లా కేంద్రంలోని చిట్యాల సమీపంలో నిర్వహిస్తున్న చేయూత అనాథ ఆశ్రమాన్ని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ బుధవారం సందర్శించారు. అక్కడ విద్యార్థులు పొందుతున్న వసతులు, ఆహారం, విద్య, మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. దీంతోపాటు వంటగదిని, టాయిలెట్స్, నివాసం ఉంటున్న గది, బెడ్‌షిట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి లక్ష్మమ్మ, జిల్లా బాలల సంరక్షణ అధికారి రాంబాబు, యాదమ్మ, జిల్లా బాలికల అభివృద్ధి అధికారిని సుబ్బలక్ష్మి, ఏఎంవో, ఆశ్రమ నిర్వాహకురాలు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆశ్రమంలో వసతులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

పీజేపీ క్యాంప్‌లోనే కోర్టు ఏర్పాటు చేయాలి

గద్వాల అర్బన్, డిసెంబర్ 18: జిల్లా కోర్టు సముదాయ నిర్మాణాన్ని పీజేపీ క్యాంప్‌లోనే ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య పేర్కొన్నారు. కోర్టు నిర్మాణాన్ని జిల్లా కేంద్రం పరిసర ప్రాంతంలోనే నిర్మించాలని న్యాయవాదులు శాంతియుత నిరసన దీక్ష చేపట్టారు.

దీక్షలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఈ క్రమంలో న్యాయవాదులకు సంఘీభావం తెలుపుతూ వారికి బీఆర్ఎస్ నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. జిల్లా కోర్టుకు పూడురు శివారు స్థలాన్ని కేటాయిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో గద్వాల ప్రజలకు ఏమాత్రం ఉపయోగం లేదన్నారు. తమ ప్రభుత్వ హయాంలోనే స్థల సేకరణ, నిధుల కేటాయింపు జరిగిందన్నారు. నేడు మెజారిటీ న్యాయవాదులు ఆ స్థలం వద్దని తీర్మానం చేసి విధులు బహిష్కరించిన నేపథ్యంలో పార్టీలో ఈ విషయంపై చర్చించినట్లు తెలిపారు. తాము కూడా ప్రజలు, కక్షిదారుల కోణంలో ఆలోచించి న్యాయవాదులు చేస్తున్న ఆందోళన న్యాయబద్ధమైనదన్నారు. జిల్లా ప్రజలకు ఆమోదమైన స్థలంలోనే కోర్టును నిర్మించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, అచ్చన్నగౌడ్ తదితరులు ఉన్నారు.

జీపీ కార్మికుల ఒక్కరోజు దీక్ష

ఖిల్లాఘణపురం, డిసెంబర్ 18: పెండింగ్ వేతనాలు చెల్లించాలని మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట మండలంలోని అన్ని జీపీల పారిశుధ్య కార్మికులు బుధవారం ఒక్కరోజు దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా మండల నాయకులు మాట్లాడుతూ.. చాలీచాలని వేతనంతో పనిచేస్తున్న మాకు ప్రతినెలా వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబ సమస్యలతో సతమతమవుతున్నామని, నాలుగు నెలలుగా వేతనాలు లేక ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. జీపీ కార్మికుల రాష్ట్రస్థాయి కమిటీ పిలుపు మేరకు దీక్షతోపాటు ఎంపీడీవోకు వినతిపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, భద్రయ్య, పల్లపు శ్రీనివాసులు, జమ్ములు, నర్సింహ, విజయలక్ష్మి, లక్ష్మీనారాయణ, భిక్షపతి, సాయిలమ్మ, పుష్ప తదితరులు ఉన్నారు.

ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న జీపీ కార్మికులు

కేజీబీవీని తనిఖీ చేసిన డీఈవో

వడ్డేపల్లి, డిసెంబర్ 18 : వడ్డేపల్లి కేజీబీవీని బుధవారం డీఈవో అబ్దుల్‌ఘని తనిఖీ చేశారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులు సమ్మె చేస్తున్న కారణంగా కేజీబీవీల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు త్వరలోనే వస్తారని, డ్యూటీ టీచర్లు, వర్కర్లు విద్యార్థులకు ఇబ్బందిలేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో నరసింహ, ఉండవెల్లి ఎంఈవో శివప్రసాద్ పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

ఎర్రవల్లి చౌరస్తా, డిసెంబర్ 18 : యువకులు చదువుతోపాటు క్రీడల్లో రాణించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని బీఆర్ఎస్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రవి తెలిపారు. మండలంలోని వేముల గ్రామంలో క్రిస్మస్ సందర్భంగా వేములయూత్ ఆర్గనైజర్స్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. గెలుపొందిన జట్టుకు మొదటి బహుమతిగా రూ.50 వేలు, రెండో బహుమతిగా రూ.30 వేలు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వేముల మాజీ సర్పంచ్ సూరి, మాజీ ఎంపీటీసీ దేవరాజ్, నాయకులు పెద్దగోవింద్ పాల్గొన్నారు.

సాగునీరందించాలని ఈఈకి వినతి

అలంపూర్, డిసెంబర్ 18 : ఎండుతున్న పంటలకు సాగునీరందించాలని ఇరిగేషన్ ఇన్‌చార్జి ఈఈ శ్రీనివాస్‌కు బుధవారం రైతులు వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు మండలంలోని క్యాతూరు శివారులోని హరిహర ఎత్తిపోతల కింద ఉన్న ఆయకట్టుకు ఆర్డీఎస్ కెనాల్ ద్వారా సాగునీరందిస్తామని ఈఈ హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంత కాలంగా ఎత్తిపోతల పని చేయకపోవడంతో సుమారు 600 ఎకరాల్లో మిర్చి పంట ఎండుముఖం పట్టిందన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే విజయుడ